క్లుప్తంగా

దాడి ఘటనపై కేసు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురానికి చెందిన తూము ఫణీంద్రపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై సమర్పణరావు శుక్రవారం తెలిపారు. ఈనెల 27వ తేదీ రాత్రి 7.30 గంటలకు పశువులకు గడ్డి వేసి వస్తున్న ఫణీంద్రపై గోనెసంచితో ముసుగువేసి, ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా కొట్టారు. గాయాలపాలైన ఫణీంద్ర రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గౌతమీ జీవకారుణ్య సంఘం ఆస్తులను కాపాడాలి

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ జీవకారుణ్య సంఘం ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. తన తండ్రి తేతలి కనికిరెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం వృద్ధుల కోసం రెండు ఎయిర్ కూలర్లను బహూకరించారు. ఆయన మాట్లాడుతూ మట్టే నారాయణమ్మ 40 ఏళ్ల క్రితం గౌతమీ జీవకారుణ్య సంఘానికి 19.7 ఎకరాల స్థలం దానం చేశారన్నారు. సంఘానికి చెందిన ఆస్తులన్నీ వృద్ధాశ్రమం సంస్థకే చెందాలని వీలునామా కూడా రాశారన్నారు. దాన్ని పట్టించుకోకుండా ఆర్టీఓ కార్యాలయానికి మూడెకరాలు, గో రక్షణ సంఘానికి మూడెకరాలు, దేవదాయశాఖ డీసీ ఆఫీస్, గెస్ట్ హౌస్, ఆలయానికి రెండెకరాల స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారన్నారు. రూ.కోట్ల విలువైన ఈ భూములను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. వృద్ధులు, కుష్ఠురోగులు, అనాథలు, అంధులకు ఆశ్రయం కల్పించాల్సిన జీవకారుణ్య సంఘం స్థలాన్ని ఈ విధంగా కట్టబెట్టడం సమంజసం కాదన్నారు. నగరంలోని చాలా చోట్ల బిచ్చగాళ్ల వల్ల ట్రాఫిక్‌కు, వాహన చోదకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారందర్నీ జీవకారుణ్య సంఘానికి తరలించి ఆహారం, వసతి, వైద్య సదుపాయం కల్పిస్తే బిచ్చగాళ్లు లేని నగరంగా మార్చడానికి అవకాశం ఉంటుందన్నారు.

ముసలమ్మ అమ్మవారికి లక్ష పుష్పార్చన

కడియం: కడియపులంక గ్రామ దేవత ముసలమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మూడో రోజు శుక్రవారం 108 రకాల పుష్పాలు, ఒక్కో రకానికి చెందిన 108 పుష్పాలతో అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. సత్యదేవ నర్సరీ, కొత్తపల్లి సత్తిరాజు దంపతుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం పంచ మంగళ హారతులు, పవళింపు సేవ జరిగాయి.

లేపాక్షి వస్తువులకు ప్రజల ఆదరణ

సీటీఆర్ఐ: లేపాక్షి ఎంపోరియంలో ప్రకటించిన డిస్కౌంట్ సేల్స్ ప్రజలను ఆకట్టుకుంటున్నాయని లేపాక్షి నగర సంస్థ మేనేజర్ మోనిక అన్నారు. ఆమె బుధవారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి ఆదేశాల మేరకు ఎంపిక చేసిన ఉత్పత్తులపై 10 నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. అన్ని రకాల చేనేత, హస్తకళల వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. లేపాక్షి ఎంపోరియంలో వస్తువులను కొనడం వలన హస్తకళలకు జీవం పోసినట్టు అవుతుందన్నారు. విదేశీయులు కూడా రాజమహేంద్రవరానికి విచ్చేసినప్పుడు లేపాక్షి ఎంపోరియంలో వస్తువులను కొనుగోలు చేస్తున్నారన్నారు. కళాకారులు చాలా రోజులు శ్రమించి తయారు చేసిన వైట్‌వుడ్ బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లేదర్ పప్పెట్, కలంకారి వస్తువులు, నీమ్ ఉడ్ కళాఖండాలు, నటరాజ విగ్రహం వంటివి ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయన్నారు. చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు 10 శాతం నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నామని, ఈ తగ్గింపు ధరలు ఆదివారం వరకూ ఉంటాయన్నారు.

సుడి తిప్పి.. రసం పీల్చి..

- వరి పంటను నాశనం చేస్తున్న దోమ
- సకాలంలో సస్యరక్షణ చేపట్టాలంటున్న వ్యవసాయ అధికారులు


పెదపూడిలో దోమపోటుకు గురైన వరి పంట

పెదపూడి: రబీలో వరి పంటపై దోమ పోటు ప్రభావం ఉంటే.. సకాలంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, లేకుంటే వరిపంట పాడయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. రైతులు వరి పండించే అన్ని ప్రాంతాల్లో గోధుమ వర్ణపు దోమ, తెల్లమచ్చదోమ నారుమడి ప్రారంభం నుంచీ ఉంటాయి. వరి పంట పిలకదశలో అరుదుగాను, పొట్టదశ, ఈనిక దశల్లో ఎక్కువగాను ఉంటాయి. పిల్ల, పెద్ద దోమలు నీటిమట్టంపై ఉండి, దుబ్బుల నుంచి రసం పీల్చడం ద్వారా నష్టాన్ని కలగజేస్తాయి. ప్రధానంగా దీనిని సుడిదోమ లేక దోమపోటుగా పిలుస్తారు.

దోమపోటు లక్షణాలు, ఉధృతి ఎక్కువైతే..

వరిపంటలో దోమపోటు ఉధృతి ఎక్కువైతే పొలం ఎండిపోయి.. పడిపోతుంది. తాలుగింజలు ఏర్పడతాయి. పంట నూర్చినప్పుడు గింజలు నూకగా మారుతాయి. సుడిదోమ వల్ల గ్రాసిస్టంట్ అనే వైరస్ కూడా వ్యాప్తి చెందడానికి అవకాశం ఉంది. ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు పొలంలో ఉన్న నీటిని గమనిస్తే సుడిదోమ తెట్టులాగా తేలియాడుతూ కనిపిస్తుంది.

రసాన్ని పీల్చుతూ..

గోధమరంగు లేదా తెలుపు రంగు, లేదా బుడిదరంగులో వీపుపై తెల్లమచ్చ దోమలు నీటి మట్టానికి పైభాగాన దుబ్బుపై రెండు రూపాల్లో (రెక్కలు ఉన్నవి, రెక్కలు అభివృద్ధి చెందనవి) కనిపిస్తాయి. ఈ దోమలు తొలిదశలో రసాన్ని పీల్చడంతో పైరు లేత పసుపు వర్ణానికి మారుతుంది. ఉధృతి పెరిగే కొద్దీ పైరు. సుడులు, సుడులుగా వలయాకారంగా ఎండిపోతుంది. నత్రజనిని అధిక మోతాదులో వాడినప్పుడు, కాలిబాటలు తీయని పొలాల్లో పైరు తొలిదశలో ఆకులను ఆశించే పురుగుల నివారణకు క్లోరిపైరిపాస్ లేదా ఫోపెనోఫాస్ లేదా సిథటిక్ పైరథ్రాయిడ్ మందులను వాడినప్పుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువవుతుంది.

సస్యరక్షణ చర్యలు

పిలకల దశలో దుబ్బుకు పది దోమలు, ఈనిక దశలో దుబ్బుకు 20 నుంచి 25 దోమలు గమనించిన వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. దోమలను తట్టుకునే వరి రకాలైన కృష్ణవేణి, దీప్తి, ఇంద్ర, అమరా, భావపురి సన్నాలు, శ్రీధృతి వంటి రకాలు సాగు చేసుకోవాలి. పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి. వరి నాటేటప్పుడు ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. బాటలు తీయాలి.

నివారణ చర్యలు

దీని నివారణకు లీటరు నీటికి ఎసిఫేట్1.5 గ్రా. లేదా మోనో క్రోటోపాస్ 2.2 మి.లీ. లేదా ఇథోఫెనోప్రాస్ 2 మి.లీ. లేదా ఫెనో బుకార్బ్ 2 మి.లీ., ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ., థైయోమితాక్సామ్ 0.2 గ్రా. లేదా బుప్రోఫర్రీజిన్ 1.6 మి.లీ. లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రా. లేదా ట్రిఫ్లూమిజోఫైరిమ్ 0.486 మి.లీ. లేదా డైనోటెప్యూరాన్ 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్, ఎథిప్రోల్ కలిపి 0.25 గ్రా. కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడంతో దోమపోటు తగ్గి, పంట సస్యరక్షణగా ఉంటుంది.

57,442 ఎకరాల్లో వరి సాగు

అనపర్తి రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917, రాజానగరంలో 8,060 ఎకరాల్లో వరి సాగవుతోంది. ప్రస్తుతం వరి పంట కొన్ని ప్రాంతాల్లో ఈనిక దశ పూర్తయింది. మరికొన్ని ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభించారు. ఈనిక దశ పూర్తవుతున్న నేపథ్యంలో సుడి లేక దోమపోటు అన్నిచోట్లా సాగు చేసే వరి పంటకు ఉంటుంది. దీంతో రైతులు అప్రమత్తంగా ఉండి, ఏ కొంచెం దోమపోటు అనిపించినా వెంటనే వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలపై సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

పశువుల పెంపకంపై ముగిసిన శిక్షణ


శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీకే అధికారులు

రాజానగరం: పాడి రైతులకు మేలు చేకూర్చేలా సేవలందించాలని శిక్షణ పొందిన యువతకు కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. పశు పోషణ, యాజమాన్య నైపుణ్యాలు, పశువులకు సోకే రోగాలకు ప్రాథమికంగా చేపట్టాల్సిన చికిత్సలపై జిల్లా ఆత్మ ప్రాజెక్టు సహకారంతో కేవీకేలో వారం రోజుల పాటు 15 మంది గ్రామీణ యువతకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ముగింపు సమావేశంలో శిక్షణ పూర్తి చేసిన వారికి డాక్టర్ నాయుడు, ఆత్మ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.జ్యోతిర్మయి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కేవీకే విశ్రాంత పశువైద్యాధికారులు డాక్టర్ జాన్ బాబు, డాక్టర్ పీవీవీఎస్ శివరావు ఆధ్వర్యంలో పశువులకు అందించే ప్రథమ చికిత్స, టీకాలు, వాటి వల్ల పశువులకు కలిగే ప్రయోజనాలు, పశువులలో రోగనిరోధక శక్తిని ఏవిధంగా పెంచాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం కేవీకేలోని పొట్టి మేకల పెంపకం, కోళ్ల పెంపకం యూనిట్లను, పశుగ్రాసం క్షేత్రాలను యువత సందర్శించింది. కార్యక్రమంలో టి.విజయవర్ధన్, జె.ప్రభాత్ నాయుడు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం


ముక్కినాడలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం

సీతానగరం: సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ సాయంతో రాజానగరం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. ముగ్గళ్ల, మిర్తిపాడు గ్రామాల్లో పార్టీ నాయకులతో ఎన్నికల ప్రచారంపై చర్చించారు. ఈ సందర్భంగా మిర్తిపాడులో ప్రజలతో మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. జగన్ పాలనపై, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేసిన అభివృద్ధిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, సాదె చంటిబాబు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, చల్లమళ్ల సుజీరాజు, ఆళ్ల కోటేశ్వరరావు, కూచిపూడి ప్రభాకర్, రుద్రం వీరేంద్ర, కవల కృష్ణమూర్తి, జొన్నలగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.


మిర్తిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


ముగ్గళ్లలో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే రాజా

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

రాజానగరం: గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ముక్కినాడలో టీడీపీకి చెందిన 50 మంది కార్యకర్తలు రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు అనదాస సాయిరామ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న కాలంలో ఈ సంక్షేమ ప్రగతి కొనసాగాలంటే మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీల, ఎంపీటీసీ రామలక్ష్మి, అనదాస సత్యనారాయణ, సోడసాని సత్యనారాయణ, మండెల లాజర్, నిత్యానందకుమార్, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదల అభ్యున్నతి


వడిశలేరులో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- వడిశలేరులో వైఎస్సార్ సీపీలో చేరికలు

రంగంపేట: పేద వర్గాల అభ్యున్నతితో పాటు, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వడిశలేరు గ్రామంలో శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, సొసైటీ అధ్యక్షుడు పోతుల బులివీర్రాజు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన కె.పెదఅప్పారావు, కె.శ్రీనివాస్, సీహెచ్ పెద్దరాజు, ఎం.చిన్నతో పాటు, మరో ఐదుగురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి, అర్హులందరికీ అందించారని, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటివి ఒక్క పథకం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు ఇప్పుడు ఏవో హామీలిస్తున్నారని, వారికి అధికారమిస్తే కుంటిసాకులు పబ్బం గడుపుతారన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. పార్టీలో చేరినవారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరామని తెలిపారు. జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, పార్టీ కన్వీనర్ నలమాటి భీముడు, నాయకుడు తొట్టిగుంట శ్రీనాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం


చినకొండేపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం మండలంలో జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఆ పార్టీ నాయకులు ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చినకొండేపూడిలో సర్పంచ్ చెరుకూరి పాల్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ – 1 ముదునూరి సురేష్‌రాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పోలినాటి రామచంద్రరావు తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాలను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, చిడిపి బంగారయ్య, చేకూరి నాని, యర్రంశెట్టి బాబులు, బచ్చు మురార్జీ, కోనే శ్రీనివాస్, వడ్లమూరి దివాకర్ రాజు, సూరపురెడ్డి వెంకటేశ్వరరావు, ప్రసాద్ రాజు, ఆకుల రామారావు తదితరులు పాల్గొన్నారు. సింగవరం గ్రామంలో ఎంపీటీసీ కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్ట శ్రీనివాస్, చిర్ల పోశియ్య, పరిమి వీర్రాజు తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను కోరారు. కనుమూరి అప్పయమ్మ, చొక్క శ్రీను, గంగిశెట్టి గంగాధరరావు, ఈలి పెద్ద, గంగిశెట్టి రత్నాజీ, వరుపుల చంద్రరావు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజా కుటుంబంపై విమర్శలు తగవు


కోరుకొండలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవలు అందిస్తున్న జక్కంపూడి రాజా కుటుంబంపై జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండలోని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జక్కంపూడి కుటుంబంలో ఐదుగురు నాయకులు ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. రాజానగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మే13 తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. అప్పుడు బత్తుల తరహా వారంతా ఎక్కడికి పారిపోతారో చూడాలని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గణేశుల పోసయ్య మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా కార్మికుల మన్ననలను పొందిన దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు అంచలంచెలుగా ఎదిగి, మంత్రిగా సేవలందించారన్నారు. ఆయన కుటుంబంపై విమర్శలు చేస్తే సహించేది లేదని విమర్శించారు. కొండపల్లి దుర్గారావు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన 18 మంది సర్పంచులు, 16 మంది ఎంపీటీసీలను ఎమ్మెల్యే రాజా గెలిపించి ఉన్నత స్థానంలో ఉంచారన్నారు. పల్లెల్లో అభివృద్ధిని పరుగులు తీయించిన రాజాను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారన్నారు. సమావేశంలో సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడియాల పాపారావు, పార్టీ నాయకులు తిరుమలశెట్టి సత్యనారాయణ, సూరిశెట్టి కుటుంబరావు, బొరుసు బద్రి, కటకం బాబ్జీ, బండాడ చందు, వాకా నరసింహారావు పాల్గొన్నారు.

ప్రేమ, త్యాగాలకు ప్రతీక జీసస్

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రై డే


కోరుకొండలో క్రైస్తవుల శిలువ యాత్ర

అనపర్తి: సర్వమానవాళి పాప ప్రక్షాళన కోసం ప్రభువు శిలువపై తన రక్తాన్ని చిందించిన రోజును పురస్కరించుకుని క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని పలు ఏసు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక కెనాల్ రోడ్డులోని ఆర్‌సీఎం అద్భుత బాల ఏసు చర్చి ఆధ్వర్యంలో విశ్వాసులు శిలువ వేషధారి ప్రదర్శనతో గ్రామంలో కల్వరి శిలువ యాత్రను నిర్వహించారు. 45 రోజులు ఏసు అనుభవించిన శ్రమను స్తుతిస్తూ, విశ్వాసులు కీర్తనలు పాడుతూ యాత్ర జరిపారు. ఈ సందర్భంగా శిలువను మోస్తున్న ఏసుక్రీస్తు, భటుల వేషధారణలతో నిర్వహించిన శిలువ యాత్ర స్థానిక పాతవూరు నుంచి కెనాల్ రోడ్‌లోని ఆర్‌సీఎం చర్చి వరకు సాగింది. చర్చి ఫాదర్ స్టీఫెన్ గోరెంట్ల, పాస్టర్లు రాజు, లాజర్ మాట్లాడుతూ పేమ, త్యాగం, కరుణకు ప్రతీకైన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. క్రీస్తు శిలువలో ఉన్న సమయంలో పలికిన ఏడు వచనాలు ప్రపంచంపై చెరగని ముద్రవేసి ప్రజలను సన్మార్గంలో నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ శిలువ యాత్రను విశ్వాసులు గ్రామంలో సుమారు రెండు కిలోమీటర్లు నిర్వహించారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

పెదపూడి: మండలంలోని క్రైస్తవ ఆలయాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవ భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. పెదపూడిలో బేతేలు ప్రార్థన మందిరంతో పాటు, పలు ఆలయాల్లో ఈ వేడుకలు జరిగాయి. పాస్టర్ బిషప్ చుక్కా సామ్యూల్‌రాజు, దేవకుమారి దంపతులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ చుక్కా జాన్ రత్నం ఉపదేశించారు. ఉదయం నుంచి ఆలయాల్లో క్రైస్తవులు ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. ఏసుక్రీస్తు శిలువపై ఉన్నప్పుడు ఏడు మాటలు పలికి ప్రాణం విడిచారని బోధకులు బోధించారు. ఆ ఏడు మాటలను చర్చి యూత్, విశ్వాసులు ఒక్కొక్కరు ఒక్కో మాటను భక్తులకు వివరించారు. ముందుగా ఏసుక్రీస్తు శిలువ మరణంపై కీర్తనలు ఆలపించారు.


అనపర్తిలో కల్వరి శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

శాంతి మార్గాన్ని అనుసరించాలి

బిక్కవోలు: గుడ్‌ఫ్రైడే వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. 40 రోజులుగా క్రైస్తవులు చేస్తున్న ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగించారు. పందలపాకలో క్రీస్తు సంఘం చర్చి వద్ద బ్రదర్ జి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ప్రజల కోసం క్రీస్తు పడిన శ్రమను స్మరించుకోవడం ఆనవాయితీ అన్నారు. మూడో రోజున ఆయన సమాధి నుంచి లేచి పునరుత్థానం పొందారన్నారు. ఏసుక్రీస్తు శిలువ మరణంతో మానవాళికి రక్షణ లభించిందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోరుకొండలో శిలువయాత్ర

మధురపూడి: గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆర్‌సీఎం మిషనరీ ఆధ్వర్యంలో క్రైస్తవులు శిలువ యాత్ర నిర్వహించారు. ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర కూరగాయల మార్కెట్, సచివాలయం, బస్టాండ్, మెయిన్ రోడ్డు, దేవస్థానం, విఘ్నేశ్వరుని ఆలయం, గాంధీ బొమ్మ, పోలీస్ స్టేషన్ రోడ్డు, రామకృష్ణా థియేటర్, పోస్టాఫీసు రోడ్డు మీదుగా తిరిగి ఆర్‌సీఎం చర్చికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమలకు కళ్లకు కట్టినట్టు వివరించారు. అలాగే ఆర్‌సీఎం, లూథరన్, బైబిల్ మిషన్ చర్చిల్లో మధ్యాహ్నం 3 గంటల వరకూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ మాణిక్యం మాట్లాడుతూ తనకు శిలువ వేసిన వారిని సైతం క్షమించాలని దేవుని కోరిన కరుణామూర్తి ఏసుక్రీస్తు అన్నారు. కాపవరం, కోరుకొండ, బూరుగుపూడి, పశ్చిమగానుగూడెం, కోటికేశవరం, రాఘవపురం, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విశ్వసనీయతకు నిలువుటద్దం జగన్

- వైఎస్సార్ సీపీ అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి


కాపవరంలో ఆదిలక్ష్మి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు నిలువుటద్దమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం రెండో రోజు మండలంలోని కాపవరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. సీఎం జగన్ ఆశయాలు సాధించేలా తన భర్త పనిచేశారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అద్భుతంగా పాలన చేశారన్నారు. ప్రజలకు మేలు జరిగితేనే తనకు ఓటు వేయండంటూ ధైర్యంగా చెబుతున్నారని, అదే మాటను చెప్పి ఓట్లు అభ్యర్థించాలని తమకు దిశానిర్దేశం చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రంగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. గతంలో పేదల గురించి ఏనాడూ ఆలోచించని చంద్రబాబు.. ఇప్పుడు పేదలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలంటూ మాయమాటలు చెబుతున్నారన్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా, నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. ఆయనను మరోమారు సీఎంగా చేసుకోవాలన్న కోరిక ప్రజల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ మార్కెళ్ల భీష్ముడు, ఉప సర్పంచ్ పోసిన గోపాలకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎ.సతీష్, పి.నాని, పంచాయతీ వార్డు సభ్యులు దోకుబుర్ర ముసలమ్మ, మామిడాల హైమావతి, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, జేసీఎస్ కన్వీనర్ బోడ్డు ముత్యాలరావు, పార్టీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో ఎమ్మెల్యే

బిక్కవోలు: మండలంలోని కాపవరం గ్రామంలోని రెండు రోజులు పాటు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి రెండు రోజుల పాటు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రచారంలో డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.